# వాత్సల్యం

మండుతున్న జ్యోతిమీద మూకుడు బోర్లించినట్టుగా వెలుగు ఆరిపోతున్నది.

చౌరాస్తాలోని మునిసిపాలిటీ గడియారం నగరం గుండెలమీద ఆరు దెబ్బలు కొట్టింది.

రోడ్డుమీది రద్దీ చూస్తూ బస్‌స్టాప్‌లో నిల్చుని ఉన్న రాజు తృళ్ళిపడ్డాడు.

ఆరు అయింది.

ఇంకా బస్ రాలేదు.

అసలే చిరాకుగా ఉంది. పక్కన కీచుగొంతు ఏడుపు ఒకటి.

విసుగ్గా తల తిప్పి ఏడుపు విన్పిస్తున్న వైపు చూశాడు.

ఆ పిల్లకు ఐదేళ్ళో, మూడేళ్ళో చెప్పడం కష్టమే.

పెద్దపొట్ట, పుల్లల్లాంటి కాళ్ళూ చేతులూ, నల్లటి రంగూ-మాసిపోయిన గౌను-

ఆ పిల్లకు సహజంగా ఉండాల్సిన పాలబుగ్గలు లేవు. బోసి నవ్వులు లేవు. ముక్కునుంచి కారుతున్న చీమిడిని ముక్కుతో ఎగపీలుస్తూ ఏడుస్తూ ఉంది.

ఆ పిల్ల పక్కనే ఓ నిండు చూలాలు నిల్చుని ఉంది.

ఆమె పిల్ల తలమీద "పెటీ పెటీ"మని మొట్టికాయలు పెడుతోంది. పిల్ల ఏడుపు తారస్థాయిని అందుకొన్నది.

"తల్లి కాబోలు" అనుకొన్నాడు రాజు.

రాజు ఆమెను పరిశీలనగా చూశాడు.

ఎముకల్లో మూలుగు సన్నగిల్లి, రక్తంలో జీవం చచ్చి, కళ్ళల్లో కాంతి మందగించినా ఆమె తనలో మరో జీవికి ప్రాణం పోస్తోంది.

కాలం గీచిన ఆమె నుదిటిమీద గీతలూ, చీకటి తెరల వెనక మినుకు మినుకు మంటున్న ఆ కళ్ళూ, ఎముకలు తప్ప కండ అనేది గీచి చూసినా కన్పించని ఆ చేతులూ, తమ తమ కథలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్టుగా ఉన్నాయి.

గంటలకొద్దీ బస్‌కోసం వేచి ఉండటం మహాబాధాకరం. పదిన్నరనుండి ఐదు వరకు ఆఫీసులో విరామం లేని పని. రాజు బాగా అలసి ఉన్నాడు.

పక్కన పిల్ల కీచుగొంతు ఏడుపు; ఓదార్చడం పోయి ఆ తల్లి పిల్లను బాదుతోంది. రాజు అసహనంగా తల్లినీ పిల్లనూ మార్చి మార్చి చూశాడు.

"ఇదిగో, ఏమమ్మోయ్! బిడ్డను అలా కొట్టకపోతే పాలిచ్చి సముదాయించ

కూడదూ?" రాజు గొంతులో మాటలు ఉంగిడి చుట్టుకుపోయాయి ఆ నిండు చూలాలిని చూస్తుంటే...

"పాలా?" ఆమె తన పొట్టకేసి చూసుకుంది.

ఆ చూపుల్లో ఉంది సిగ్గో, అసహ్యమో, జాలో, వాత్సల్యమో-అర్థం చేసుకోవడానికి రాజు ప్రయత్నించలేదు.

'పాలైతే ఆ దుకాణంలో ఉన్నాయ్, పైసలే లేవు.' చిన్నగా వణుకుతున్న కంఠంతో అన్నది ఆ చూలాలు.

రాజు జేబులోనుంచి పావలా బిళ్ళ తీసి ఆమె చేతిలో వేశాడు.

'ఈ పిల్లను మోసుకెళ్ళలేను. రోడ్డు దాటాలి. పాలు తీసుకొని ఇప్పుడే వస్తాను, చూస్తూ ఉండండి బాబుగారూ!' దీనంగా అర్థించింది.

'అవును పాపం! నిన్ను నువ్వే మోసుకోలేకుండా వున్నావ్, పిల్లనుకూడా ఎక్కడ మోస్తావ్!' మనసులో అనుకున్నాడు రాజు.

'బాబుగారూ!'

'సరే వెళ్ళు! త్వరగా వచ్చేయ్' అన్నాడు రాజు.

సంచిలోనుంచి గిన్నె బయటికి తీసి, డబుల్ డెక్కర్ బస్‌లా చిన్నగా కదిలింది ఆ చూలాలు.

'త్వరగా రా!' వెనకనుంచి అన్నాడు రాజు.

ఆమె విన్నదో లేదోకాని వెనక్కు తిరిగి చూడలేదు.

'పోషించలేనివాళ్ళకు పిల్లలెందుకో? బుద్ధిలేకపోతే సరి!' నిండుగా, బరువుగా, మెల్లగా, తిరిగి చూడకుండా వెళ్తున్న ఆమెను చూస్తూ అనుకొన్నాడు రాజు.

ఆలోచనా స్రవంతిలో పడి కొట్టుకుపోతున్నాడు రాజు. పేవ్‌మెంటుమీదనుంచి ఏడుస్తూ రోడ్డుకేసి అడుగులు వేస్తున్న పిల్లను చూశాడు. యాంత్రికంగా ఒక్క ఉదుటున ముందు కెళ్ళాడు. పిల్ల రెక్కపట్టుకొని ఈడ్చుకొచ్చి పక్క నిల్చోబెట్టుకొన్నాడు. దాంతో పిల్ల గొంతు పెంచింది. ఆ పిల్ల ఏడుపు మాన్పించడం ఎలాగో తెలియక తికమక పడసాగాడు.

గంటస్తంభం మీది గడియారం ఒకే దెబ్బ కొట్టింది. తృళ్ళిపడి గడియారంకేసి చూశాడు రాజు. ఆరున్నర అయింది.

అరే! ఆవిడ ఏమైంది? ఇరవై నిముషాలు దాటింది, ఇంకా రాలేదేం?

రాజుకి తను ఎక్కవలసిన బస్ వస్తూ కన్పించింది. బస్ వచ్చి ఆగింది. ఎక్కాలా? వద్దా? రాజు మీమాంసలో పడ్డాడు. కనుచూపుమేరలో ఆ పిల్ల తల్లి వస్తున్న జాడలేమీ కన్పించడంలేదు.

తను వెళ్ళిపోతే ఎలా? ఈ పిల్ల రోడ్డు మీదకు వెళ్ళి ఏ బస్ కిందో పడిపోతే?

ఆగిన బస్ బయలుదేరింది. రాజుకు పరిగెత్తుకెళ్ళి ఎక్కాలనిపించింది. కాని అలా చెయ్యలేకపోయాడు. బస్ వెళ్ళిపోయింది. అతడికి ఆ పిల్ల తల్లిమీద కోపం వచ్చింది. డబ్బు ఇచ్చి, పైగా పిల్ల బాధ్యత నెత్తిన పెట్టుకొన్నందుకు తనమీద తనకే కోపం వచ్చింది.

మరో పది నిముషాలు గడిచాయి.

ఆ పిల్లతల్లి రాలేదు.

రాజుకు ముచ్చెమటలు పట్టాయి.

ఎదురుగా ఉన్న దుకాణంనుంచి పాలు తేవడానికి ఇంతసేపా?

అది-అదే-ఆ పిల్లతల్లి-ఆ ఆడది-తనను మోసం చెయ్యలేదుగదా? ఏమిటీ దారుణం?

ఆమె పిల్లను వదిలేసి వెళ్ళిపోయిందా? మాతృత్వానికి ప్రతిరూపంగా కన్పించిన ఆమె ఇంత దారుణానికి పాలుపడిందా? కన్నబిడ్డనే ఇలా వదిలేసి వెళ్ళిపోయిందా?

ఏం? ఎందుకు వదిలెయ్యకూడదు?

మోయలేని బరువును దించెయ్యడం తప్పా? కాని... ఒకరు మోయలేక వదిలేసిన బరువును ఇంకొకరు ఎవరు కావాలని నెత్తికి ఎత్తుకుంటారు?

తనకెందుకొచ్చిన న్యూసెన్సు ఇదంతా? వెళ్ళిపోతే పోలా? అనవసరంగా జాలిపడి చిక్కులో ఇరుక్కున్నాడు.

రాజు రెండు అడుగులు ముందుకు వేశాడు.

"మాయ్యా!" కీచుగొంతు ఏడుపు.

రాజు కాళ్ళకు బంధం పడినట్టు ఆగిపోయాడు.

పిల్లకేసి చూశాడు. ఆ పిల్ల ముక్కు ఎగబీలుస్తూ తలెత్తి రాజుకేసి చూస్తోంది.

ఏం చెయ్యడం? ఇక ఆ ఆడది రాదు. పసిబిడ్డను వదిలేసి ఎలా వెళ్ళడం?

ఇంటికి తీసుకెళ్తే?

తనకు ఇద్దరే పిల్లలు. ఈ పిల్ల తనకు పెద్ద బరువుకాదు.

కాని... దీని కులం?... కన్నబిడ్డను వదిలేసిన ఆ స్త్రీ ఎలాంటిదో?-

అయినా తన భార్య చస్తే అంగీకరించదు. తన పిల్లలతోపాటు ఈ పిల్ల పెరగడానికి చస్తే ఒప్పుకోదు.

అతడి మనసులోని భావాలు అర్థం అయినట్టు ఆ పసిది అతడి ముఖంలోకి బిక్కుబిక్కుమంటూ చూస్తోంది. ఏడుపు మానేసి చూస్తోంది. రాజుకు ఆ పిల్లను చూస్తుంటే కడుపులో ఏదో కెలికినట్టుగా అన్పించింది.

రాజు చేతిలో ఉన్న బిస్కెట్ పొట్లాం విప్పి రెండు బిస్కెట్టు పిల్ల చేతిలో పెట్టాడు. ఆ పిల్ల బిస్కెట్టు తింటూ ఉంది.

రాజు బుర్రలో ఓ మెరుపు మెరిసింది.

చుట్టూ కలియజూశాడు.

అతడి చూపులు పిట్టగోడమీద కూర్చుని బీడి తాగుతున్న గఫూర్‌మీద వాలాయి.

పిల్లను తీసుకెళ్ళి పిట్టగోడ దగ్గర, గఫూర్ ప్రక్కగా నిల్చున్నాడు.

"ఇదుగో భాయ్! సిగరెట్టు ప్యాకెట్ అయిపోయింది. తెచ్చుకుంటా. కాస్త మా పాపను చూసుకుంటావా?" అన్నాడు రాజు ఎదురుగా కనిపిస్తున్న కిల్లీకొట్టుకేసి చూస్తూ. గఫూర్ తల తిప్పలేదు. పిల్లనుగానీ, రాజునుగానీ చూడలేదు. బీడి పొగ వదుల్తూ "ఊ" అన్నాడు.

రాజు పిల్లచేతిలో మరో రెండు బిస్కెట్లు పెట్టాడు.

"పాపా! ఈ మామయ్య దగ్గరే ఉండు, నేను ఇప్పుడే వస్తాను" అనేసి ఎవరో తరుముతున్నట్టుగా రాజు పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు.

ఎవరో లుంగీ పట్టుకొని లాగినట్టయి గఫూర్ చటుక్కున తలవంచి చూశాడు. లుంగీ లాగుతూ పిల్ల కన్పించింది. గఫూర్‌ను చూడగానే చటుక్కున ఆ పిల్ల లుంగీ వదిలేసి ఏడుపు ప్రారంభించింది.

అంతవరకూ ఆ పిల్ల సంగతే గుర్తులేని గఫూర్‌కు చటుక్కున ఏదో గుర్తొచ్చి నట్టయింది. చేతి గడియారం చూసుకొన్నాడు. ఏడు అయింది. వేసవికాలం కావడంవల్ల అప్పుడే చీకట్లు ముసురుతున్నాయి. అంతకుముందే వీధి దీపాలు కూడా వెలిగాయి.

అరే! వాడేడీ? మోసం! ఈ పిల్ల వాడి కూతురా? అయి వుండదు. అందుకే వదిలేసి వెళ్ళిపోయాడు.

తను ఎందర్నో మోసం చేశాడు. వాడెవడో తననే మోసం చేశాడే?

పిల్లను తేరిపార చూశాడు.

కనీసం శుభ్రమైన గౌనుకూడా లేదు. చిన్నమెత్తు బంగారం లేదు. ఇక రూపం సరేసరి! అమ్మినా ఎవడూ కొనడు.

థూత్! తనకెందుకీ పీడ?

గఫూర్ రెండడుగులు ముందుకు వేశాడు.

పిల్ల లుంగీ పట్టుకుంది. ఏడుస్తూంది. గఫూర్ ముఖంలోకి చూసి కళ్ళు మూసుకుంది. అయినా లుంగీ వదల్లేదు. ఏడుపు మానలేదు.

గఫూర్‌కు ఆ పిల్లమీద జాలివేసింది. ఆమాంతం ఎత్తుకొని బుజ్జగించాలనిపించింది.

ఇదేమిటీ? తనకు ఎప్పుడూ ఎవరిమీదా జాలి కలుగలేదు. కాని ఈ బిడ్డమీద తనకు జాలి కలుగుతోంది.

తీసుకెళ్ళి పెంచుకుంటే?

కాఫిర్ బిడ్డను పెంచడమా? ఓ అల్లా!

గఫూర్ చెంపలు వేసుకున్నాడు.

లుంగీ వదిలించుకోవాలనుకొన్నాడు. కాని ఆ పని చెయ్యలేకపోతున్నాడు.

పాపం! ఎంత భయంగా తన లుంగీ పట్టుకుందో?

గఫూర్ నలువైపులా చూశాడు.

మోకాళ్ళపైకి అంగవస్త్రం కట్టుకొని, షర్టులేకుండా, చేతిలో పంచాంగం వగైరాలతో వస్తున్న శాస్త్రులవారు కన్పించారు.

గఫూర్ మనసులో ఓ ఆలోచన తలెత్తింది.

ఆ శాస్త్రులవారికి తగిలిస్తే పోలా?

"ఏమండోయ్! శాస్త్రుల్లూ!"

శాస్త్రి ఉలిక్కిపడ్డాడు. నిలబడ్డాడు.

"దూరం! దూరం!" అంటూ దగ్గరగా వస్తున్న గఫూర్‌కు దూరంగా వెనక్కు అడుగులు వేశాడు.

"ఏహే! భయపడకు. నిన్ను ముట్టుకోనులేవయ్యా! రెండు నిముషాలు నిల్చో. ఈ పిల్లను చూస్తూండు, నేను ఇప్పుడే ఆ పక్కకెళ్ళి కాలుమడుచుకొస్తాను" అని శాస్త్రి సమాధానానికి ఎదురుచూడకుండానే "పాపా! తాత! తాత దగ్గిర ఉండు. నేను ఇప్పుడే వస్తా" అంటూ పిల్ల గుప్పెట్లోనుంచి లుంగీ లాక్కుని చరచర వెళ్ళిపోయాడు గఫూర్.

తాతలంటే ఉండే సర్దా పిల్లలకు మరెవరన్నా ఉండదు.

శాస్త్రి మోకాళ్ళపైకి ఉన్న ధోవతిని పట్టి లాగుతూ "తాత! తాత!" అంటూ బోసి నోటితో నవ్వింది.

శాస్త్రికి వళ్ళు జలదరించింది.

ఏదో పురుగు వంటిమీద పాకుతున్నట్టుగా అన్పించింది.

"రామ! రామ!" వెనక్కు జరిగాడు.

ఆ పిల్ల "తాత! తాత!" అంటూ ముందుకు అడుగులు వేసింది.

"హరి! హరీ! ఈ తురకపిల్లకు నేను తాతనా?" లబలబలాడిపోయాడు శాస్త్రి.

ఎంతకూ రాడు గఫూర్.

ఆ పిల్ల శాస్త్రిని వదలడం లేదు.

వాడు ఇంకా రాలేదేం?

మోసం జరగలేదుకదా?

అవును! అంతే జరిగి ఉండాలి.

లేకపోతే ఇంతసేపు ఎందుకు రాడు? పిల్లను వదిలేసి ఎందుకు వెళ్ళిపోతాడు?

శాస్త్రి గాభరాగా అటూ ఇటూ చూశాడు.

ఈ పీడను వదిలించుకోవడం ఎలా?

నవగ్రహ శాంతి చేయించి వస్తున్న శాస్త్రి పెద్ద అశాంతిలోనే పడ్డాడు.

✿ ✿ ✿

రాజు ఇంటి గడపలో కాలు పెడ్తూనే, దేనికోసమో మారాం చేస్తున్న చిన్న కొడుకు ఏడుపు విన్నాడు.

అంతలోనే ఆ ఏడుపును మింగేస్తూ కీచుగొంతు ఏడ్పు విన్పించింది.

"మాఁయ్యా!" కీచుగొంతు పిలుపు, ముక్కులు ఎగబీలుస్తున్న శబ్దం-వెక్కిళ్ళు-మళ్ళీ ఏడుపు-కీచుగొంతు ఏడుపు-చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది.

ఆ పిల్ల ఏడుస్తూ రోడ్డుకు అడ్డంగా నడుస్తున్న దృశ్యం కళ్ళముందు మెదిలింది.

రాజు గిర్రున వెనక్కు తిరిగాడు.

ఆ బిడ్డను ఆ రౌడీ ఏం చేశాడో? చదువుకొని సభ్య సమాజంలో సంస్కారవంతుడిగా చలామణి అవుతున్న తనే ఆ పిల్లను వదిలించుకొన్నాడు.

మరి ఆ రౌడీ బాధ్యత వహిస్తాడా?

గబగబా నడుస్తున్నాడు. కన్పించిన టాక్సీ ఆపి ఎక్కి కూర్చున్నాడు.

లకడీకాపూల్ చౌరస్తా దగ్గర్లో మరోవైపునుంచి పరుగు పరుగున వస్తున్న గఫూర్ కన్పించాడు రాజుకు.

వీడు తను అనుకున్నంత చేశాడు.

బస్‌స్టాండులో జనం గుమికూడి ఉన్నారు.

ఒకవైపునుంచి రాజూ, మరోవైపునుంచి గఫూర్ "పాపా!" అంటూ జనాన్ని చీల్చుకుంటూ వచ్చారు. అక్కడ కన్పించిన దృశ్యం చూసి నిలిచిపోయారు.

పాప శాస్త్రులవారి కాళ్ళు పట్టుకొని వదలడంలేదు. జనం తలాకమాటా అంటున్నారు.

"బాబోయ్! నా మాట నమ్మండి. ఈ పిల్లకు నేను తాతను కాదు. ఇది నా మనమరాలు కాదు" లబలబలాడుతున్న శాస్త్రి మాటలు ఎవరూ విన్పించుకోవడం లేదు.

చుట్టూ మూగిన జనానికి నచ్చచెప్పడానికి తాతకు తాతలు దిగొస్తున్నారు.

రాజుని చూసి ఆ పిల్ల "బిస్కెట్టు మాఁయ్యా!" అంటూ దగ్గరకొచ్చి చెయ్యిచాపింది.

పక్కనే నిల్చున్న గఫూర్‌ని చూసి కళ్ళు మూసుకుంది. బిస్కెట్లకోసం చాపిన చెయ్యి మాత్రం దించలేదు.

రాజు బిస్కెట్ల పొట్లం పాప చేతిలో ఉంచాడు. పిల్ల బిస్కెట్లు తినటంలో లీనమైపోయింది.

రాజూ, గఫూర్ ఆ పిల్లను తను తీసుకెళ్తానంటే తను తీసుకెళ్తానని పోటీ పడడాన్ని జనం వింతగా చూస్తున్నారు.

లేగ దూడకోసం 'అంబా' అని అరుస్తూ వచ్చే ఆవులా 'చిట్టీ' అని అరుస్తూ జనంలోకి చీల్చుకొని వచ్చింది ఒక నిండు చూలాలు. వాత్సల్యం కట్టలు తెంచుకుంది. తల్లీ, బిడ్డా పెనవేసుకుపోయారు. బిడ్డ తలమీద రెండు వేడి కన్నీటి చుక్కలు పడ్డాయి.

ఆ స్త్రీ రాజువైపు చూడడానికి సిగ్గుపడుతోంది. ఆమె వద్దని వారిస్తున్నా వినిపించుకోకుండా జేబులోనుంచి పదిరూపాయలు తీసి పాప చేతిలో పెట్టాడు రాజు, బనియన్ జేబులోనుంచి గఫూర్ ఒక రూపాయి, కొన్ని చిల్లర డబ్బులూ తీసి పిల్ల చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. శాంతి చేయిస్తే వచ్చిన సంభావన డబ్బులు బిడ్డ చేతిలో పెట్టి దీవించి కళ్ళనీళ్ళతో కదలిపోయాడు శాస్త్రి.

(62 ఆలిండియా రేడియో - హైదరాబాద్)

(62 - పుస్తక ప్రపంచం)